
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



వెలుగుల మాటున..

బాణసంచా తయారీ కేంద్రాలపై అగ్నిమాపక శాఖ అధికారులు పటిష్ట నిఘా పెట్టకపోవడంతో ఏటా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 8లో



చిరుత పులా.. బావురు పిల్లినా?

ద్వారకాతిరుమల మండలంలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది చిరుత పులా.. లేక బావురు పిల్లా అనే అనుమానాలు కలుగుతున్నాయి. 8లో



ఖోఖో పోటీలకు ఎంపిక

టి.నరసాపురం మండలంలోని బొర్రం పాలెం హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి అండర్‌-18 ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక పోటీలు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్‌

ఉపాధి పనులతో ప్రగతి బాట



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల, జెడ్పీ చైర్‌పర్సన్‌ పద్మశ్రీ, కలెక్టర్‌ నాగరాణి

యలమంచిలి: పల్లె సీమలను ప్రగతి బాటలో నడిపేందుకు జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ చదలవాడ నాగరాణి కోరారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బూరుగుపల్లి, దొడ్డిపట్లలో ఉపాధి హామీ నిధులు రూ.35 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్‌ రోడ్లకు శనివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్‌ గంటా పద్మశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాల కల్పించాలని ఆదేశించారు. మంత్రి రామానాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్‌ పద్మశ్రీ మాట్లాడారు. ఆర్డీఓ దాసిరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌, తహసీల్దార్‌ గ్రంధి పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 86.6 శాతం హాజరు



భీమవరం: జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌ టీచర్‌ ఎలిజిబిలిటీ (టెట్‌) టెస్ట్‌కు 86.6 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ జి.నాగమణి తెలిపారు. భీమవరం డీఎన్నార్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాలలో ఉదయం 90 మందికి 84 మంది, మధ్యాహ్నం 90 మందికి 80 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఉదయం 220 మందికి 175 మంది, మధ్యాహ్నం 220 మందికి 198 హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్‌ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఏలూరు (టూటౌన్‌): మహిళా కార్మికులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్‌ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ రాష్ట్ర మహిళా కార్మికుల సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణ పనులు జరిగే చోట నివాసముంటున్న ప్రాంతాల్లో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. కొన్ని సంఘటనలు వెలుగులోకి రావడం లేదని, ఇందుకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులపై జరుగుతున్న దాడులపై పోరాటాలు చేస్తామన్నారు. మహిళా ఆల్‌ ఇండియా కమిటీ సభ్యురాలు అనసూయమ్మ, సీనియర్‌ నాయకులు పిల్లి నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, జిల్లా బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు ఎర్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శవాగారం..
అక్రమాలే సర్వం

ఏలూరు జీజీహెచ్‌పై నీలినీడలు

- మృతదేహాల వ్యాపారంలో సూత్రధారులెవరు?
- జీజీహెచ్‌లో అధికారుల పనితీరుపై సందేహాలు
- మార్చురీ వద్ద సీసీ కెమెరాలు మాయం
- రికార్డుల్లోనూ అవకతవకలు
- పోలీస్‌ నిఘా విభాగం ఆరా



ఏలూరులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ముఖద్వారం

ఏలూరు టౌన్‌ : ఏలూరు సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్‌) వివాదాల్లో చిక్కుకుంది. ఓ వైపు ప్రజలకు ఉత్తమ సేవల్లోనూ ఘోరంగా విఫలం.. మరోవైపు మార్చురీలో అనాథ శవాల అక్రమ వ్యాపారంతో నీలినీడలు అలముకుంటున్నాయి. నగరానికి ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో ప్రజలకు అత్యుత్తమ స్థాయి వైద్య, శస్త్ర చికిత్సలు అందుతాయనే ఆశలపై నీళ్లు చల్లుతుండగా.. జీజీహెచ్‌ ప్రతిష్టను దిగజార్చేలా సిబ్బంది, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జీజీహెచ్‌ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ వెట్రి సెల్వి, ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. మార్చురీలో అనాథ శవాల అక్రమ వ్యాపారంపై కలెక్టర్‌, జిల్లా ఎస్పీ దృష్టి సారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


గుర్తుతెలియని వ్యక్తుల సంతకాలతో..

జీజీహెచ్‌లోని మార్చురీకి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, ఆత్మహత్యలు, అనుమానాస్పద మృతులు, హత్యలు ఇలా అనేక సందర్భాల్లో మృతిచెందిన వారి శవాలను తరలిస్తుంటారు. జిల్లా కేంద్రం, సర్వజన ఆస్పత్రి కావటంతో రోజూ ఏదో ఒక సంఘటనలో మృతదేహాలను మార్చురీకి తరలిస్తూ ఉంటారు. నెలకు సుమారుగా 30 నుంచి 50 వరకూ మృతదేహాలను మార్చురీకి తీసుకువస్తారు. వీటిని ఫోరెన్సిక్‌ వైద్య బృందం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహిస్తూ సంబంధిత బంధువులకు అప్పగిస్తారు. ప్రతి మృతదేహానికి సంబంధించి వివరాలు రికార్డుల్లో తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది. ఇక అనాథ శవాలైతే వాటికి అంతిమ సంస్కారాలకు సంబంధించి మున్సిపాల్టీ సిబ్బంది, మార్చురీ వైద్యులు సంతకాలు చేస్తూ శ్మశాన వాటికకు తరలించి, అక్కడి రికార్డుల్లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే జీజీహెచ్‌ మార్చురీలో రికార్డుల్లో అవకతవకలు జరిగినట్టు తెలుస్తోంది. మున్సిపల్‌ సిబ్బంది సంతకాలు కాకుండా ఇష్టారాజ్యంగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తుల సంతకాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

నిఘా అధికారుల ఆరా

ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీలో అనాథ శవాల అక్రమ వ్యాపారంపై పోలీస్‌ నిఘా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో అనాథ శవానికి రూ.లక్షల్లో రేటు కట్టి విక్రయిస్తూ జేబులు నింపుకోవటం.. ఈ అక్రమ వ్యాపారంలో మార్చురీ ఇన్‌చార్జ్‌ హస్తం ఏమైనా ఉందా ? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. హాస్పిటల్‌ ఉన్నతాధికారుల అండదండలు లేకుండా కేవలం మార్చురీ ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది అంత ధైర్యంగా శవాలను జిల్లాలు, రాష్ట్రాలు దాటించే అవకాశం లేదంటున్నారు. మరోవైపు ఏలూరు జీజీహెచ్‌ పర్యవేక్షణాధికారి డాక్టర్‌ సుధాకర్‌ ఈ వ్యవహారంపై విచారణకు కమిటీని నియమించినట్టు చెబుతున్నారు.

ఆరుగురికి ఇద్దరే విధుల్లో..



ఏలూరు జీజీహెచ్‌లోని శవపంచనామా చేసే మార్చురీ వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొంత కాలంగా సీసీ కెమెరాలు సైతం లేకపోవటం సందేహాలకు బలాన్ని చేకూర్చుతోంది. మార్చురీ వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం అవి కనిపించకుండా పోయాయి. అనాథ శవాల అక్రమ వ్యాపారానికి సాక్ష్యాలు లేకుండా చేసేందుకే సీసీ కెమెరాలను ముందస్తు ప్లాన్‌తోనే తొలగించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చురీలో ఆరుగురు డ్యూటీ చేయాల్సి ఉండగా మహిళా సిబ్బందిని పక్కనబెట్టి, ఇద్దరు పురుషులు మాత్రమే అన్నీ చూసుకోవటం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి.



శయన మహావిష్ణువు అలంకారం

వైభవంగా వసంతోత్సవం

- చూర్ణోత్సవం, పుష్పయాగోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు
- నేటి నుంచి ఆర్జిత సేవల పునరుద్ధరణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం జరిగిన చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీపుష్పయాగోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయ కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు, పండితులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం అర్చనాది కార్యక్రమాలు జరిపారు. ఆ తరువాత శ్రీవారు, అమ్మవార్లకు వసంతాలను సమర్పించి, హారతులిచ్చారు. చూర్ణోత్సవంలో భాగంగా శ్రీవారిని కీర్తిస్తూ అర్చకులు, పండితులు, అలాగే పలువురు మహిళా భక్తులు వడ్లను దంచారు. ఆ తరువాత అర్చకులు భక్తులపై వసంతాలను చల్లారు.

ద్వాదశ కోవెల ప్రదక్షిణలు

ఉభయ దేవేరులతో శ్రీవారికి ఆలయ ప్రాంగణంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో రాత్రి నివేదన కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. అర్చకులు, పండితులు ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవాకాలాన్ని నిర్వహించారు. అలాగే ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో పిండి వంటను ఆరగింపుచేసి స్వామికి హారతులిచ్చారు. అనంతరం స్వామివారి పవళింపుసేవా మందిరాన్ని సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించి శ్రీపుష్ప యాగోత్సవాన్ని జరిపించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శయన మహావిష్ణువుగా..

శయన మహావిష్ణువు అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. శేషపాన్పుపై పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవిలు సేవలు చేస్తున్నట్టు ఉన్న స్వామివారి అలంకారాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి, పరవశించారు.

ఆర్జిత సేవల పునరుద్ధరణ

బ్రహ్మోత్సవాలు ముగియడంతో సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ ఎస్వీఎస్‌ఎన్‌ మూర్తి తెలిపారు.



శ్రీవారి కల్యాణ మండపంలో చూర్ణోత్సవంలో వడ్లు దంచుతున్న అర్చకులు



క్షేత్ర పురవీధుల్లో భక్తులపై వసంతాలు చల్లుతున్న దృశ్యం

పనులు లేక.. సంక్షేమం కానరాక..

ప్రజలకు అప్పుల తిప్పలు

- పథకాలు అమలు చేయని కూటమి సర్కారు
- వ్యవసాయ, ఉపాధి పనులు లేక పాట్లు
- ఇసుక లేక భవన నిర్మాణ కార్మికుల వెతలు
- నాలుగు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు
- అప్పుల బాట పడుతున్న జనం
- గత జగన్‌ సర్కారులో పథకాలతో ఊరట



భీమవరం(ప్రకాశం చౌక్‌): కూటమి ప్రభుత్వం పుణ్యమా నాలుగు నెలలుగా ప్రజలు బతుకు దెరువు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ, ఉపాధి హామీ పనులు లేకపోవడంతో పాటు ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఎడతెగని వర్షాలతో పనులు సాగక పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జీవనం కోసం అప్పుల బాట పడుతున్నారు. బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. కుటుంబ పోషణతో పాటు డ్వాక్రా రుణాల చెల్లింపు, పిల్లల చదువుల ఫీజుల కోసం మహిళలు సైతం అప్పులు చేస్తున్నారు.

సూపర్‌ సిక్స్‌ పేరుతో మోసం : కూటమి ప్రభుత్వంలో సూపర్‌ సిక్స్‌ పథకాల వస్తాయని ఆశగా ఎదురుచూసిన ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. వ్యవసాయానికి పెట్టుబడి సాయం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అమ్మకు వందనం వంటి పథకాల ఊసెత్తకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

గత ఐదేళ్లు.. సంక్షేమ పరవళ్లు : గత జగన్‌ సర్కారులో ఐదేళ్ల పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయి. అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా తదితర పథకాలను నిర్దిష్ట సమయానికి పక్కాగా అమలు చేయడంతో ప్రజలకు ఆర్థిక భరోసా కలిగింది. ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో లబ్ధి చేకూరడంతో ప్రైవేట్‌ అప్పుల తిప్పలు తప్పాయి. కుటుంబ పోషణ, పిల్లల ఫీజులకు మహిళలకు పథకాలు అండగా నిలిచాయి. కరోనా విపత్తు సమయంలోనూ పథకాలు ఇచ్చి మాజీ సీఎం జగన్‌ ప్రజలను ఆదుకున్నారు.

నిర్మాణ రంగం కుదేలు : 'పశ్చిమ'లో నాలుగు నెలలుగా పనులు లేక పలు రంగాల కార్మికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఇసుక దొరక్క నిర్మాణ రంగం కుదేలయ్యింది. తాపీ, వ డ్రంగి, పెయింటింగ్‌, ఎలక్ట్రికల్‌, సెంట్రింగ్‌ తదిత ర కార్మికులకు పనులు దొరకడం గగనంగా మారింది. దీనికితోడు ప్రస్తుతం వ్యవసాయ సీజన్‌ కావడంతో ఉపాధి హామీ పనులు లేవు. వ్యవసాయ పను లు అంతంతమాత్రంగా ఉన్నాయి. అలాగే వాతావరణం అనుకూలించకపోవడంతో ఆక్వా రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. రొయ్యల రైతులు నష్టాలు చూడటంతో పాటు ప్రాసెసింగ్‌ యూనిట్లకు రొయ్యల దిగుమతులు తగ్గుతున్నాయి. ఆయా ఫ్యాక్టరీల్లో రోజువారీ పనుల చేసే వారికి పనులు ఉండటం లేదు.

2019-24 కాలంలో జిల్లాలో సంక్షేమ పథకాల అమలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మఒడి	2,46,525	597.62
రైతు భరోసా	2,25,883	282.59
ఆసరా	1,02,352	1,067.35
చేయూత	2,72,111	552.8
కాపు నేస్తం	2,24,286	79.40
ఈబీసీ నేస్తం	12,286	19.02
సున్నావడ్డీ	11,65,513	110.50
విద్యా దీవెన	67,837	119.64
వసతి దీవెన	59,871	80.70

అప్పులు చేసి సాగు



నేను కౌలుకి వ్యవసాయం చేస్తున్నా. కూటమి ప్రభుత్వం కౌలు రైతుకు సైతం పెట్టుబడి సాయం అందిస్తుందని ఆశించా. అయితే ఇప్పటివరకూ సాయం అందలేదు. దీంతో అప్పు చేసి సాగుకు పెట్టుబడి పెట్టాను. గత ప్రభుత్వంలో సాగుకు ముందే రైతు భరోసా కింద కౌలు రైతుకూ సాయం అందేది. కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్న ఎలాంటి సాయం అందించలేదు. సాగు ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం.

– బి.రాంబాబు, కౌలు రైతు, కొండేపూడి

ఇబ్బంది పడుతున్నాం



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్‌ సిక్స్‌ పేరుతో చెప్పిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. అంతా అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తోంది. ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీయడమే తప్ప హామీల అమలు ఎప్పుడు చేస్తారో ముఖ్యమంత్రి లేదా డిప్యూటీ సీఎం గానీ చెప్పడం లేదు.

– బాషాఖాన్‌, నరసాపురం

ఫోర్జరీ సంతకాలతో నిధుల స్వాహా

రామన్నగూడెంలో వార్డు సభ్యుల ఆందోళన

ద్వారకాతిరుమల: మండలంలోని రామన్నగూడెం పంచాయతీ కార్యాలయంలో తమ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.10 లక్షల నిధులను స్వాహా చేశారని పలువురు వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 18న వార్డు సభ్యుడు పాకలపాటి మాణిక్యాలరావు డీపీఓకి ఫిర్యాదు చేశారు. ఈనెల 15న పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించగా తాము పాత తీర్మానాలను పరిశీలించామని, అందులో తనతో పాటు మరికొందరి సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి వాటి ద్వారా పలు తీర్మానాలను ఆమోదించి నిధులు బొక్కేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో పాటు మరో అధికారి పాత్ర ఉందని వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే ఇప్పటికే గ్రామానికి చెందిన కొత్తపల్లి రమేష్‌ అనే వ్యక్తి పంచాయతీలో రూ.20 లక్షల నిధులు దుర్వినియోగం జరిగాయని మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొండపల్లి సహదేవుడు తనకు ఏడాది కాలానికి సంబంధించిన వేతనం సొమ్మును గత పంచాయతీ కార్యదర్శి నాగరాజు కాజేశాడని కలెక్టర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ఆయా అక్రమాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15.5 మి.మీ సగటు వర్షపాతం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో సగటున 15.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొగల్తూరులో అత్యధికంగా 42.4 మి.మీ వర్షం కు రిసింది. మండలాల వారీగా తాడేపల్లిగూడెంలో 0.4, పెంటపాడులో 0.4, తణుకులో 13.6, అత్తిలిలో 0.8, గణపవరంలో 3.2, ఆకివీడులో 3.6, ఉండిలో 10.4, పాలకోడేరులో 12.2, పెనుమంట్ర లో 5.4 మి.మీ వర్షం పడింది. ఇరగవరంలో 5.2, పె నుగొండలో 23.6, ఆచంటలో 20, పోడూరులో 17.2, వీరవాసరంలో 21.2, భీమవరంలో 36.2, కాళ్లలో 11.2, నరసాపురంలో 21.4, పాలకొల్లులో 36, యలమంచిలిలో 26.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



బుట్టాయగూడెం : జల్లేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాసినా.. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశంలో కారుమబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో సుమారు గంట సేపు భారీ వర్షం పడింది. అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి కొండ కాల్వలు పొంగి పొర్లాయి. దీంతో మండలంలోని దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి 217.27 మీటర్లకు వరద నీరు చేరింది. దీంతో ఇరిగేషన్‌ అధికారులు జలాశయం రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎంఐ ఏఈ సురేష్‌ తెలిపారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. కొన్ని రోజులుగా వాతావరణంలో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు ఎండ, మరో పక్క వర్షంతో ప్రజలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. భీమడోలు మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో పక్క డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్లపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపించింది. గుండుగొలను వీవర్స్‌ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షం నీరు కిందకు పారకుండా ఇళ్లల్లోకి చేరుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

చదరంగం పోటీలకు నూజివీడు విద్యార్థి ఎంపిక


కొల్లా భావన్‌ను అభినందిస్తున్న పిన్నమనేని వెంకట కుమార్

నూజివీడు: పట్టణంలోని కుమార్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థి కొల్లా భావన్ అండర్–15 విభాగంలో జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పిన్నమనేని వెంకట కుమార్ ఆదివారం తెలిపారు. గుంటూరు జిల్లా గోరంట్లలో ఈనెల 15నుంచి 17వరకు నెక్స్‌జన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన అండర్–15 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏపీ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులోని హోసూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యం స్వాధీనం

వేలేరుపాడు: తెలంగాణ నుంచి రాష్ట్రంలోని వేలేరుపాడు మండలానికి ద్విచక్రవాహనాలపై అక్రమ మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వేలేరుపాడు మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన ముత్తబోయిన రాంబాబు ద్విచక్రవాహనంపై బ్రాందీ, బీర్ బాటిళ్లు తరలిస్తుండగా భూదేవిపేట ఊరుబయట పట్టుకున్నారు. శివకాశీపురం గ్రామానికి చెందిన కొవ్వాల శివరామకృష్ణ, ద్విచక్రవాహనంపై మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మద్యం బాటిళ్ల విలువ రూ.10,150 ఉంటుందని పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ ఘటనలో ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ మెడ నుంచి ఇద్దరు యువకులు పుస్తెల తాడు లాగేందుకు యత్నించిన సంఘటనలో భార్యాభర్తలు గాయపడ్డారు. గరగపర్రుకు చెందిన సామన శ్రీను భార్యతో కలిసి శనివారం బంధువుల ఇంటికి వెళ్ళి తిరిగి వస్తుండగా, గరగపర్రు నాగముని దేవాలయం దాటాక గుర్తు తెలియని యువకులు మంగళసూత్రం లాగేందుకు యత్నించారు. తప్పించుకునే ప్రయత్నంలో భార్యభర్తలు పడిపోయారు. తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

వెలుగుల మాటున చీకటి వ్యాపారం

అనధికారికంగా బాణసంచా తయారీ


తణుకులో బాణసంచా విక్రయాలు (ఫైల్)

తణుకు: బాణసంచా తయారీకి పశ్చిమ గోదావరి జిల్లా పెట్టింది పేరు. దీపావళికే కాకుండా ఇతర కార్యక్రమాలకు ఇక్కడి నుంచే బాణసంచా ఎగుమతి చేస్తుంటారు. కేవలం దీపావళికి వారం రోజుల ముందు మాత్రం హడావుడి చేసే అగ్నిమాపక శాఖ అధికారులు అనంతరం తయారీ కేంద్రాలపై నిఘా పెట్టకపోవడంతో ఏటా పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనధికారికంగా అనేక బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు పదుల సంఖ్యలో విక్రయ కేంద్రాలు కూడా అనుమతి లేకుండా వెలుస్తున్నాయి.

ప్రమాదాలు జరిగినా పట్టవా?

జిల్లాలో ఏడుగురు బాణసంచా తయారీ కోసం లైసెన్సు తీసుకున్నారు. వీరు కేవలం ఒక్కసారి 15 కిలోల వరకు తయారు చేసుకునేందుకు అనుమతి ఉంది. ఈ నిబంధన ఎక్కడా అమలు కావడంలేదు. అక్రమంగా మందుగుండు తయారీ జోరుగానే సాగుతోంది. గతంలో అక్రమ నిల్వలే కొంప ముంచాయనే ఆరోపణలు ఉన్నాయి. పూర్వపు ఉమ్మడి జిల్లాలో దువ్వ, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, అన్నవరప్పాడు, తాడిపర్రు వంటి ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. గతంలో దువ్వలో తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో అయిదుగురు మృత్యువాత పడగా అదే గ్రామంలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పేలి భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. అధికారికంగా తయారీ కేంద్రాలకు లైసెన్సులు తీసుకుంటున్న వారి కంటే మరో రెండు రెట్లు అనధికారికంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు వీరు తీసుకుంటున్న లైసెన్సుకు తయారు చేస్తున్న బాణసంచా పరిమితికి సంబంధమే లేకుండా ఉంటోంది. కొందరు హోల్‌సేల్ వ్యాపారులు సైతం తూతూమంత్రంగా లైసెన్సులు తీసుకుని తమ వ్యాపారం కానిచ్చేస్తున్నారు. దువ్వ గ్రామంలోని శివారు ప్రాంతాల్లో తోటలను లక్ష్యంగా చేసుకుని బాణసంచా తయారు చేస్తున్నారు.

అనధికారికంగా విక్రయాలు

బాణసంచా విక్రయాల కోసం తాత్కాలిక అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అనుమతి ఉన్న దుకాణాల వద్ద ఇప్పటికే కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా విక్రయ దుకాణాలు పెద్ద సంఖ్యలో నెలకొల్పుతున్నారు. ఉన్నతాధికారులు బాణసంచా దుకాణాల నిర్వహణపై సమావేశాలు నిర్వహించి శాఖల వారీగా చర్యల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదు.

జాగ్రత్తలు తప్పనిసరి

- దీపావళి బాణసంచా సామాగ్రిని ఇళ్లలో నిల్వ ఉంచరాదు. దీపపు బుడ్డి, కొవ్వొత్తులు, నిప్పురవ్వల వాటి వల్ల ఏ ప్రమాదం జరగకుండా ఉండే స్థలాల్లో మాత్రమే ఉంచాలి.
- దీపావళి బాణాసంచా చిన్న పిల్లలకు అందుబాటులో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిల్లలు, పెద్దలు కాటన్ దుస్తులు ధరించి, దీపావళి మందు సామాన్లు కాల్చడం మంచిది. ఆ దుస్తులు త్వరగా అంటుకోవు.
- ఇళ్ల లోపల కాకుండా ఆరుబయట దీపావళి టపాసులు కాల్చాలి.
- దీపావళి మందు సామాన్లు కాల్చేటప్పుడు మీ కళ్లలో నిప్పురవ్వల ఇసుక రేణువులు పడకుండా చూసుకోవాలి. అందుకు కళ్లద్దాలు ధరించడం మంచిది.
- గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడే వారి వద్ద ఎక్కువ ఒత్తిడితో పేలే బాంబులు కాల్చకూడదు.
- గడ్డివాములు, పూరిళ్లు, చెత్తకుప్పల వద్ద దీపావళి మందు సామగ్రి కాల్చవద్దు.
- తారాజువ్వలు, రాకెట్లు వంటి మందు సామాగ్రి వల్ల గడ్డి వాములు, పూరిళ్లు అగ్నిప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నాయి. వాటిని కాల్చడాన్ని తగ్గించాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగులు తీయొద్దు. నేలపై పడుకుని దొర్లాలి. పక్కనున్న వారి సహాయంతో రగ్గును ఉపయోగించి మంటలు ఆర్పాలి.
- కాలిన భాగాలపై చల్లని నీరు పోయాలి. బర్నాల్ వంటి క్రీములు దగ్గర ఉంచుకోండి.
- అపార్టుమెంట్ల పై అంతస్తులలో నివసించే వారు దీపావళి మందు సామగ్రి కిందికి దిగి కాల్చుకోవాలి.
- పెట్రోల్ బంకులు, పరిసర ప్రాంతాలలో దీపావళి మందు సామాగ్రిని కాల్చటం మంచిది కాదు.
- బహిరంగమైన ప్రదేశాలలో మాత్రమే దీపావళి షాపులు నిర్వహించుకోవాలి.

కఠిన చర్యలు తప్పవు

“జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు 7 వరకు ఉన్నాయి. వీరంతా ఇప్పటికే లైసెన్సులు తీసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. క్షేత్రస్థాయిలో తయారీ కేంద్రాలను పరిశీలించి ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నాం. లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాసరావు, అగ్నిమాపకదళ జిల్లా అధికారి, భీమవరం

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మకు భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు తక్కువమంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. మధ్యాహ్నం సమయానికి మబ్బులు ఎక్కువగా కాయడంతో భక్తులందరినీ సాయంత్రం 5 గంటలలోపు ఆలయ కమిటీ వారు బయటకు పంపించారు.

శ్రీ రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ అమ్మవారు

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వెలసిన శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వారం అమ్మవారికి పూజా టిక్కెట్లపై రూ.48 వేలు, లడ్డూ ప్రసాదంపై రూ.18,750, ఫొటోల అమ్మకంపై రూ.69,870 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు.

చిరుత పులా..బావురు పిల్లినా ?


జంతువు పాదముద్రను సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకా నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది చిరుత పులా... లేక బావురు పిల్లా అనే అనుమానాలు కలుగుతున్నాయి. శనివారం రాత్రి స్థానిక వీరాంజనేయ దాబా సమీపంలో చిరుత పులి సంచరించినట్లు అందిన సమాచారంపై పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి జంతువు పాదముద్రలను సేకరించారు. అవి ఉన్న తీరును బట్టి జాడలు చిరుత పులివేనని అధికారులు ప్రాథమికంగా అంచనాకి వచ్చారు. ఈ నేపథ్యంలో ద్వారకా నగర్, భీమడోలు, పొలసానిపల్లి తదితర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, టాంటాం ద్వారా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అటవీశాఖ, పోలీస్ అధికారులు ఆదివారం సైతం పులి జాడను కనుగొనేందుకు వేటను కొనసాగించారు. ద్వారకానగర్ శ్రీకార్తికేయ ఫ్లైయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీ ప్రాంతంలో జంతువు పాదముద్రలను సేకరించారు. పరీక్షల నిమిత్తం వాటిని రాజమండ్రిలోని ల్యాబ్‌కి పంపారు. సమీప రైతు కరణం శ్రీనివాసరావు ఈ ప్రాంతంలో సంచరిస్తుంది చిరుత పులి కాదని, బావురు పిల్లి అని చెబుతున్నారు. తమ కోళ్ల మకాం వద్ద రాత్రి సమయాల్లో ఎక్కువగా ఆ పిల్లి సంచరిస్తుందని, పదేళ్లుగా ఇక్కడే ఉంటుందని తెలిపారు. శనివారం సాయంత్రం కూడా బావురుపిల్లి కనిపించిందని, చిరుతను పోలి ఉన్న ఆ పిల్లిని చూసి అంతా భయాందోళన చెందారని అన్నారు. అటవీశాఖ అధికారులను తన కోళ్ల మకాం వద్దకు తీసుకెళ్లి ఆ పిల్లి జాడలను కూడా శ్రీనివాసరావు చూపాడు. దాంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే రాజమండ్రి ల్యాబ్‌కి పరీక్షల నిమిత్తం పంపిన పాదముద్రల ఫలితాలు వచ్చే వరకు తామేమి చెప్పలేమని అటవీశాఖ అధికారులు అంటున్నారు.

నారాయణ విద్యా సంస్థకు షోకాజ్


రాతపూర్వకంగా డీవైఈఓకు తెలియజేస్తున్న సంస్థ ప్రిన్సిపాల్

ఆకివీడు: సెలవు దినాల్లో పాఠశాలలు తెరవవద్దని హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో ఆకివీడు, భీమవరంలోని నారాయణ విద్యా సంస్థకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఉప విద్యా శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఏబీవీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా విద్యా సంస్థల్ని డీవైఈఓ ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులు స్కూల్‌లో ఉండటాన్ని గుర్తించిన డీవైఈఓ ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు. అనంతరం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యా శాఖాధికారిణి నాగమణికి తెలియజేసినట్లు వివరించారు. ఏబీవీపీ నియోజకవర్గ విభాగ్ కన్వీనర్ ఈశ్వర్ సాయి మాట్లాడుతూ గత నాలుగైదు పర్యాయాలు ఆయా విద్యా సంస్థలు సెలవు దినాల్లో తెరిచిన విషయాన్ని విద్యా శాఖ అధికారులకు తెలియజేశామన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే సెలవుల్లో పాఠశాలలు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సెలవు దినాల్లో విద్యా సంస్థలు తెరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఈత కొడుతూ గల్లంతైన వ్యక్తి

పెదవేగి: పోలవరం కుడికాలువలో వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన బెజవాడ ప్రసాద్ (45) ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పోలవరం కుడికాలువలో ఈత కోసం దిగి, ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు.

జిల్లా డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక


ఎన్నికైన ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షుడిగా ఏలూరు నగరపాలక సంస్థ డ్రైవర్ తోట శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం ఏలూరులోని సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికల అధికారి కె.చిరంజీవి, వి.పాపారావు కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సహాయ అధ్యక్షుడిగా జి.ఈశ్వరరావు, కార్యదర్శిగా ఎస్ఎస్‌వి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ప్రాణాంతకంగా గుంతలు

తణుకు పట్టణంలో రోడ్ల దుస్థితి


తణుకు మున్సిపల్ నెంబరు 2 ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు

భారీ వర్షాలకు తణుకు మున్సిపాలిటీ పరిధిలోని రహదారులు ఛిద్రమై వర్షపు నీరు రోడ్డుపైనే నిలవడంతో ప్రయాణం నరకంలా మారింది. రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరగవరం రోడ్డు, రైల్వే స్టేషన్‌రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, కోయాక్సిల్ రోడ్డు, వేల్పూరు రోడ్డులే కాకుండా చిన్నపాటి సందులు సైతం గోతుల మయం కావడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. భారీవర్షం పడిన సందర్భంలో రోడ్డు మొత్తం వర్షపునీటితో నిండిపోయిన సందర్భాల్లో గోతులు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. తాత్కాలిక మరమ్మత్తులు చేయించాల్సి ఉన్నా.. పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. అధికారులు సమస్యను తక్షణం పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

– తణుకు అర్బన్


తణుకు ఆర్వోబీ కింది భాగంలో రోడ్డు దుస్థితి


తణుకు ఇరగవరం రోడ్డులో


తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు


మొగల్తూరు పీఎస్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

మొగల్తూరు: చోరీకి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నపాలెం గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్‌గా పని చేస్తున్న కడలి వెంకట లక్ష్మీ నివాసంలో గత నెల 14న రూ.1.50 లక్షల విలువైన వెండి, బంగారు అభరణాలు చోరీకి గురయ్యాయని, ఈ కేసులో ఆదివారం రామన్నపాలెం ఓఎన్‌జీసీ రోడ్డులో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గుర్తించి విచారణ చేశామన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన మటపర్తి రాజ్ కుమార్, పసలదీవి గ్రామానికి చెందిన అల్లం రాములను అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించారన్నారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్టు సీఐ వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: అనారోగ్యంతో బాధపడుతున్న కైకరానికి చెందిన కున సూర్యనారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యనారాయణ కొంతకాలంగా పైల్స్ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స పొందుతున్నా తగ్గకపోవడంతో బాధ తాళలేక శనివారం వాష్ రూంకి వెళ్లి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సూర్యనారాయణను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం మధ్యాహ్నమే సూర్యనారాయణ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

మారుజాతి కలప స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కలప

కుక్కునూరు: రాత్రి వేళ జామాయిల్ కర్ర మాటున అక్రమంగా మారుజాతి కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి మండలంలోని కివ్వాక గ్రామం నుంచి కలపను తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. కలప విలువ ఎంతనేది తెలియాల్సి ఉంది.

చెస్ పోటీల విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ర్యాంకింగ్ చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం భీమవరంలో బహుమతులు అందచేశారు. భీమవరం ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి, జిల్లాకు, పట్టణానికి పేరు తీసుకురావాలని కోరారు. టోర్నమెంట్‌కు సహకరించిన అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య వర్తక సంఘం భవనం కమిటీకి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు, ట్రాఫిక్ సీఐ నారాయణ మూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ఆర్.ఎస్.ఎస్. నాయకులు వనమా శ్రీకాంత్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాసుల చేతుల మీదుగా అందజేశారు.

ఖోఖో పోటీలకు ఎంపిక


అండర్-18 ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి అండర్–18 ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరిలోని పాఠశాలల నుంచి బాలికలు 40 మంది, బాలురు 50 మంది హాజరు కాగా, వీరిలో ప్రతిభ చూపిన 15 మంది బాలికలు, 15 మంది బాలురను ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాల తల్లితండ్రుల కమిటీ అధ్యక్షుడు కె.రమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, రంగారావు, ప్రధానోపాధ్యాయుడు ఆలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ సేవలు అభినందనీయం


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని మున్సిపల్ మేనేజర్ రవిసుధాకర్ అన్నారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షుడు వీవీఎస్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పదమ్‌కుమార్ గుప్తా ఆర్థిక సహకారం అందించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలందించారు. 143 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయగా 23 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. 11 మందిని ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు తరలించారు. జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ


హాస్టల్ వసతులపై విద్యార్థులను ఆరా తీస్తున్న జడ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అడిషనల్ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా పట్టణంలోని హాస్టళ్లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర హాస్టల్స్, కళాశాల హాస్టల్స్‌ను సందర్శించి వార్డెన్లతో మాట్లాడారు. హాస్టల్స్ పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజనంలోని నాణ్యత, రిజిస్టర్లు, బాత్‌రూంలు, వంట గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. న్యాయవాది లోకేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో జూనియర్ లైన్‌మేన్‌కి తీవ్రగాయాలు


గాయపడ్డ నాగ శివ శంకర్

అత్తిలి: విద్యుత్ షాక్‌తో ఓ జూనియర్ లైన్‌మేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో జూనియర్ లైన్‌మేన్‌గా పని చేస్తున్న పాలిమేర నాగ శివ శంకర్ గ్రామంలో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతని మెడ భాగం కాలిపోయింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తణుకులోని ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

కనకదుర్గమ్మకు పూజలు


అమ్మవారికి పూజలు నిర్వహించిన దృశ్యం

పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 8 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఏపీ టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్షకు 220 మందికిగాను 175 మంది, మధ్యాహ్నం పరీక్షకు 220 మందికిగాను 198 మంది పరీక్షకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కవులకు సత్కారం


సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బుద్ధాల కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కళా తల్లి సేవలు అభినందనీయమని అన్నారు. కవులను సత్కరించి ప్రోత్సహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు.

పాతూరులో సమస్యల తిష్ట

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణంలోని పాతూరు 12వ వార్డులో పలు సమస్యలు తిష్ట వేశాయి. ఈ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. అనేక ప్రాంతాలలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. అవుట్‌లెట్స్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో వర్షం పడితే రోడ్లపై మురుగునీరు నిలిచిపోతుంది. పాతూరులో అపరిశుభ్ర వాతావరణం, దోమల విజృంభణ, కలుషిత తాగునీటి వలన చిన్నారులు, స్థానికులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాతూరులోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు ఇవి

- 11వ వార్డు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మురుగనీరు తాడేపల్లి చెరువులో కలవడంతో ఆ చెరువు వ్యర్థాలకు నిలయంగా మారింది. దీంతో ఇక్కడ దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా పెరిగిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- కోడే వెంకట్రావు సమాధుల వీధిలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దీంతో ఇళ్లల్లోని వాడకం నీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. ఈ ప్రాంతం శివారున ఉన్న కంకర రోడ్డునను సీసీ రోడ్డుగాను, డ్రెయిన్లు నిర్మించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్టిమేషన్‌లు తయారు చేశారు. గడప గడపకు నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రహదారి నిర్మాణం సాగలేదు.
- ఈ వార్డులో ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మొక్కలు, తుప్పలు పెరిగిపోవడం, చెత్తచెదారాలు పేరుకుపోవడంతో దోమలు, విషజంతువులు పెరిగిపోయాయి.
- పాతూరులోని కనకదుర్గగుడి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎదురుగా ఓ ఇంటి సమీపంలో మంచినీటి పంపిణీ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో ఉదయం, సాయంత్రం నీరు వృధాగా పోతోంది. అలాగే పాతూరు నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మీదుగా కరకట్ట వైపు పలు చోట్ల కుళాయి పైపులైన్‌ల లీకేజీలు ఉన్నాయి.
- స్థానిక వేపచెట్టు సమీపంలోని సాయినాథ నిలయం వద్ద దక్షిణం వైపు ఉన్న రహదారి ప్రారంభంలో మురుగు డ్రెయినేజీ మీద ఉన్న కల్వర్టును ఎత్తు చేయాలి. కల్వర్టు రాళ్లు దిగువున ఉండటంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయిన్ పొంగుతోంది.
- స్థానిక వేపచెట్టు సమీపంలోని రహదారి మార్గంలో సీసీ రోడ్డు, డ్రెయిన్ కొంతమేర విరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణం నిమిత్తం వచ్చిన భారీ లోడ్ వాహనాల కారణంగా రోడ్డు, డ్రెయిన్ సిమెంట్ పలకలు ముక్కలయ్యాయి.
- మునిసిపాలిటీ వారి ఆధ్వర్యంలో నిర్మించిన క్వార్టర్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డంపర్ బిన్నులను నిరుపయోగంగా అలానే వదిలేశారు. అవి వర్షానికి నాని, ఎండలకు ఎండి శిథిలావస్థకు చేరాయి.


పాతూరు తాడేపల్లిచెరువులో కలుస్తున్న మురుగు నీరు, చెత్తాచెదారాలు


మునిసిపల్ క్వార్టర్స్ ఖాళీ స్థలంలో పాడైన డంపర్ బిన్నులు, అక్కడ ఏర్పడిన అపరిశుభ్ర వాతావరణం


కనకదుర్గమ్మగుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎదురుగా ఓ ఇంటి సమీపంలో మంచినీటి పైపులైన్ లీకేజీ


వేపచెట్టు వీధి దక్షిణం వైపు రహదారిలో ఛిద్రమైన రహదారి, డ్రెయిన్


వేపచెట్టు వీధి సాయినాథ నిలయం వద్ద కల్వర్టు ఎత్తు పెంచాల్సిన ప్రదేశం

రోడ్డు నిర్మించాలి



పాతూరు కోడే వెంకట్రావు సమాధుల వీధి శివారులో సీసీ రోడ్డునిర్మాణానికి నిధులు రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణం నేటికీ జరగలేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే ఉంటుంది. సీసీ రోడ్డు, డ్రెయిన్లు నిర్మించాలి.

– పి.దేవి, పాతూరు

అధ్వానంగా పారిశుద్ధ్యం



పాతూరులో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాలలో డ్రెయినేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. వేపచెట్టు సమీప వీధిలో కల్వర్టును ఎత్తు చేయాలి.

– కోడే రమేష్, పాతూరు


పాతూరులోని ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కలు


పాతూరు శివారు అవుట్‌లెట్ వద్ద వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు, చెత్తాచెదారాలు


కోడే వెంకట్రావు సమాధుల వీధి శివారులో సీసీ రోడ్డు, డ్రెయిన్ లేని దృశ్యం

లిడ్‌క్యాప్‌కు నిధులు సమకూర్చాలి



రామన్నగూడెంలో సమావేశమైన దళితసేన

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లిడ్‌క్యాప్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఆదివారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ చెప్పులు కుట్టే చర్మకారులకు, లెదర్‌వర్క్ చేసే కార్మికులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. అలాగే, హెల్త్ కార్డులు, చర్మకారుల రథచక్రం వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలని రవిప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా దళిత సేన అధ్యక్షుడు చీలి మోహనరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దిర్శిపాముల పుష్ప, నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్తియ్య, కడియద్ద, జగ్గన్నపేట, కృష్ణాపురం, చినతాడేపల్లి గ్రామ అధ్యక్షులు గెడ్డం ఆనందరావు, కిలాడి రవి, జాలపర్తి వెంకటేశ్వరరావు, దూలపల్లి నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడక, పౌష్టికాహారం తప్పనిసరి

తణుకు టౌన్: నిత్యం నడక, పోషకాహారంతోనే బోలు ఎముకల వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందని ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య చెప్పారు. ఆదివారం ప్రపంచ బోలు ఎముకల దినోత్సవం సందర్భంగా తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిమ్మగడ్డ మాట్లాడుతూ ఎముకలు ధృడంగా ఉండేందుకు పాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి ఎండీ స్వాలీహా, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఎన్ఆర్ఐ సంస్థల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాయల్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక తెలగ కల్యాణ మండపంలో అఖిల భారత కాపు, తెలగ, బలిజ సంఘం, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రవాస భారతీయ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చినిమిల్లి మాట్లాడుతూ ఎంతోమంది ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితులు అడ్డుపడుతున్నాయన్నారు. అటువంటి వారికి రాయల్స్‌క్లబ్, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ వంటి సంస్థలు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. 76 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఒకొక్కరికీ రూ.12 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రటరీ రావు, అఖిల భారత కాపు, తెలగ, బలిజ సంఘం ట్రస్టీ సీహెచ్ గోపాలకృష్ణ, నరసాపురం రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి పాల్గొన్నారు.

బాబోయ్.. ఆకివీడు మేము రాము !

ఆకివీడు: మండలంలో ఉద్యోగం చేసేందుకు భయమో? లేక మరే ఇతర కారణాలున్నాయో గానీ కొత్తగా బదిలీ అయిన ఉద్యోగులు మాత్రం ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదు. మండల స్థాయి ఉద్యోగులు బదిలీ అయినప్పటికీ ఆ స్థానాల్లోకి బదిలీ అయిన ఉద్యోగులు వచ్చి బాధ్యతలు స్వీకరించడం లేదు. బాబోయ్ ఆకివీడు మేము వెళ్లలేము అంటూ రిలీవ్ ఆర్డర్లు తీసుకోవడం లేదు. దీంతో జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. బదిలీ అయిన స్థానాలను ఏ విధంగా భర్తీ చేయాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక ఇక్కడి నుంచి బదిలీ అయిన ఉద్యోగులనే మళ్లీ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా మండల పరిషత్ లోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణపవరం, గ్రామీణ నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలకోడేరు మండలాలకు బదిలీ అయి ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేక తిరిగి వారినే ఇక్కడకు డిప్యుటేషన్‌పై బాధ్యతలు స్వీకరించే విధంగా జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. మండలంలోని పలు శాఖల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

వదలని వరుణుడు


మొగల్తూరులో కురుస్తున్న వర్షం

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయుగుండంగా మారడంతో గత 5 రోజులుగా మొగల్తూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు తిరిగి మరోసారి అల్పపీడనం ఏర్పడటంతో ఆదివారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లపు ప్రాంతాలతో పాటు కేపీపాలెం, కాళీపట్నం, పేరుపాలెం, మొగల్తూరులోని ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వేటకు వెళ్లే మత్స్యకారులతో పాటు రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: మండలంలో ఈ నెలాఖరు వరకు జరగనున్న రెవెన్యూ రీసర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. 21న వల్లూరుపల్లి, 22న ఆకుతీగపాడు, బోడపాడు, 23న ముదునూరు, దర్శిపర్రు, 24న ఎన్ఆర్‌పీ అగ్రహారం, యానాలపల్లి, 25న కె.పెంటపాడు, 26న జట్లపాలెం, మౌంజిపాడు, 28న పరిమెళ్ల, 29న రావిపాడు, 30న మీనవిల్లూరు గ్రామాల సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. రైతులు, భూ యజమానులు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధులకు సంచార వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంచార వైద్యసేవలు నిర్వహించారు. తణుకు పట్టణం, మండపాక, వెంకట్రాయపురం పరిసర గ్రామాల్లో మంచం మీద నుంచి లేవలేని 7 గురు వృద్ధులకు వైద్యసేవలు అందించారు. సంఘ సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో తాడినాడకు సత్కారం

తణుకు టౌన్: అంతర్జాతీయ సాహితీ సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాల్‌లో 24 గంటల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణానికి చెందిన రచయిత తాడినాడ భాస్కరరావు ×సాహిత్య సుగంధాల సౌరభం× అనే కవితను చదివి వినిపించారు. శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి టీ పార్థసారథి, కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు భాస్కరరావును ఘనంగా సత్కరించారు.

అలంపురంలో నేడు షుగర్ వైద్య పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రిలో సోమవారం షుగర్ వైద్యపరీక్షలు జరుగుతాయని ట్రస్టు ప్రతినిధి కొలనువాడ కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఆపోలో ఆసుపత్రికి చెందిన ప్రఖ్యాత గాంగ్రీన్ వైద్యనిపుణులు రాజశేఖర్ ద్వారా రెండురోజుల వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం సుమారు 130 మంది పరీక్షలు చేయించుకొన్నారన్నారు. సోమవారంకూడా రోగులకు ఆయనఅందుబాటులో ఉంటారన్నారు. ఈఅవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

28 నుంచి ఉపవాస పండుగలు

పెంటపాడు: ఈనెల 28 నుంచి బి.కొండేపాడు సీయోను మందిరంలో ఉపవాస పండుగలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి ఎం.సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 3 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తణుకు ఈపీఏఫ్ సంఘ అధ్యక్షుడు పి.మోజెస్ ప్రవీణ్, నిజామాబాద్‌కు చెందిన బ్రదర్ రమేష్‌జాన్, పాస్టర్ ఎం.జోసఫ్, సువార్త గాయకులు సాలోమోన్‌రాజు పాల్గొంటారన్నారు.

రమ్యశ్రీకి మెడిసిన్‌లో ఉచిత సీటు


తోట రమ్యశ్రీ

అత్తిలి: గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి మెడిసిన్‌లో ఉచిత సీటు సాధించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది బల్లిపాడు గ్రామానికి చెందిన తోట రమ్యశ్రీ. ఇటీవల నిర్వహించిన నీట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 654వ ర్యాంకు సాధించి వైజాగ్ ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఉచిత మెడిసిన్ సీటు దక్కించుకుంది. రమ్యశ్రీ బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2020లో టెన్త్‌లో 586 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. జ్ఞానభూమి పరీక్ష రాసి ఈడ్పుగల్లులో బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ బైపీసీలో చేరి 948 మార్కులు సాధించింది. తండ్రి తోట శివన్నారాయణ వ్యవసాయం చేస్తుండగా, తల్లి ఉషా పద్మావతి గృహిణి. రమ్యశ్రీ చిన్నప్పటినుండే చదువులో రాణిస్తుండటంతో తల్లిదండ్రులు ప్రోత్సాహం, సైన్సు ఉపాధ్యాయుడు డీఎంజీ ప్రసాద్ గైడెన్స్‌తో మెడిసిన్‌లో సీటు దక్కించుకుంది. మెడిసిన్‌లో ఉచిత సీటు సాధించిన పూర్వ విద్యార్థిని తోట రమ్యశ్రీకి బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయుడు డీఎంజీ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో విష్ణు విద్యార్థుల ప్రతిభ


శ్రీవిష్ణు ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాల టీంకు మొమెంటోలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్‌లో మహిళల విభాగంలో భీమవరం విష్ణు ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలిచింది. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీల్లో పురుషుల విభాగంలో మొదటి స్థానం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు దక్కగా, మహిళల విభాగంలో మొదటి స్థానం భీమవరం శ్రీ విష్ణు మహిళ ఇంజనీరింగ్ కళాశాల టీంకు దక్కింది. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. పురుషుల విభాగంలో రెండో స్థానంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మూడో స్థానంలో కృష్ణా జిల్లా అమృత సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వీవీఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కిందని క్రీడల కమిటీ కన్వీనర్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు తెలిపారు. మహిళల విభాగంలో ద్వితీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు, మూడో స్థానం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు సంయుక్తంగా దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే పరిశీలకులుగా డాక్టర్ సునీత, డాక్టర్ శరత్, ఇంజనీరింగ్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనకు కృషి


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆకివీడు: అంధత్వ నిర్మూలనకు లయన్స్ క్లబ్‌లు ప్రత్యేక కృషి చేస్తున్నాయని చినకాపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల జానకిరామరాజు (రాము) చెప్పారు. మండలంలోని చినకాపవరంలో ఆదివారం లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోల్పోకుండా ముందుగానే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వయస్సు రీత్యా వచ్చే కంటి జబ్బులకు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరంలో 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని, మరో 9 మందికి కళ్లజోళ్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినకాపవరం క్లబ్ కార్యదర్శి బండి బాలకృష్ణ, కోశాధికారి కె.వెంకన్న, ఏడుకొండలు, మద్రివాడ వెంకట్రావు, జవ్వాది నాగరాజు, నాగభూషణం, పి.రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా ఆటల పోటీలు

ఉండి: ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చ్ (ఏఈఎల్‌సీ) సంస్కరణ దినోత్సవం మతోద్ధరణ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ క్రీడలు ఆదివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు కబడ్డీ, త్రీ లెగ్‌డ్ రేస్, రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అలాగే సండే స్కూల్ చిన్నారులు పలు క్రీడల్లో పాల్గొన్నారు. స్త్రీ, పురుషులకు బైబిల్ క్విజ్, బైబిల్ పరీక్ష, బైబిల్ క్విక్ రిఫరెన్స్, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, కార్యదర్శి, కోశాధికారి, యూత్, సండే స్కూల్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.